విద్యా ప్రాప్తిరస్తు.!

- విద్యాభివృద్ధికి సాయపడుతున్న ప్రభుత్వ పథకాలు
- జగనన్న అమ్మఒడి, విద్యా, వసతి, విదేశీ దీవెనలతో సహకారం
- 28వ వార్డులో 4294 మంది విద్యార్థులకు లబ్ధి

బీచ్ రోడ్డు: అభివృద్ధి అంటే రోడ్లు, భవనాలు మాత్రమే కాదు. మానవ వనరులు కూడా ప్రధానమే. ఇందుకు నాణ్యమైన విద్యను అందించడం చాలా కీలకం. అందుకే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఒక వైపు నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల అభివృద్ధితో పాటు ఇంగ్లిష్ మీడియం అమలు చేశారు. మరో వైపు కార్పొరేట్ విద్యా సంస్థలో పేద విద్యార్థుల చేరేలా పలు పథకాలను ప్రవేశ పెట్టారు. అవే జగనన్న అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ దీవెన పథకాలు. ఈ పథకాల ద్వారా నేరుగా ఖాతాల్లో నగదును జమ చేసి విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందిస్తున్నారు. ఇలా జీవీఎంసీ 28వ వార్డు పరిధిలో 4294 మంది విద్యార్థులు రూ.14.9 కోట్లు అందుకున్నారు.

ఉన్నత విద్యకు పునాది అమ్మఒడి

ఈ వార్డులో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకునే 1767 మంది విద్యార్థులకు జగనన్న అమ్మఒడి పథకం కింద రూ.7.5 కోట్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జమ చేసింది. పిల్లల చదువు విషయంలో సతమతమయ్యే తల్లిదండ్రులకు జగనన్న అమ్మఒడి పథకం అండగా నిలిచింది. ఉన్నత చదువులకు ఒక పునాదిగా ఈ పథకం ప్రజలకు ఉపయోగపడుతోంది.

జగనన్న విద్యా దీవెన

బీటెక్, పీజీ, ఎంటెక్ వంటి కోర్సులను పేద విద్యార్థులకు అందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం జగనన్న విద్యా దీవెన. ఈ పథకం కింద 28వ వార్డు పరిధిలో 1381 మంది లబ్ధిపొందారు. వారి ఖాతాల్లో రూ.5 కోట్లు ప్రభుత్వం జమ చేసింది. ఇలా ఉన్నత విద్యను నిరుపేద విద్యార్థులకు చేరువ చేసింది.



జగనన్న వసతి దీవెన

ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులు కళాశాల ఫీజుతో పాటు వసతి కోసం కూడా చాలా డబ్బులు వెచ్చించాల్సి ఉంటుంది. ఈ భారం కూడా తట్టుకోలేక చాలా మంది పేద విద్యార్థులు ఉన్నత చదువులను మధ్యలోనే నిలిపివేస్తున్న ఘటనలు అనేకం. అలా జరగకుండా ఉండేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న వసతి దీవెన ద్వారా అండగా నిలుస్తుంది. ఈ పథకం ద్వారా వార్డు పరిధిలో 1111 మందికి రూ.2 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసింది. దీంతో వారు నిర్భయంగా ఉన్నత విద్యను కొనసాగిస్తున్నారు.

జగనన్న విదేశీ విద్యా దీవెన

ధనికులకు మాత్రమే సొంతం అనుకున్న విదేశీ విద్య.. ఇప్పుడు పేద, మధ్య తరగతి విద్యార్థులు కూడా అందిపుచ్చుకునేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న విదేశీ విద్యా దీవెనను ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా విదేశీ విద్యను అభ్యసించేందుకు వెళ్లిన వార్డు పరిధిలో 35 మందికి ఖర్చుల నిమిత్తం రూ.40 లక్షలు వారి ఖాతాల్లో జమ చేసింది.

ఇద్దరి ఆడపిల్లలను చదివించగలిగా..



నేను ఒక ప్రైవేటు కంపెనీలో చిన్న ఉద్యోగం చేస్తున్నాను. కుటుంబ పోషణకే నా సంపాదన సరిపోతుంది. నాకు ఇద్దరు ఆడపిల్లలు. వారి చదువు కోసం చాలా ఆందోళన ఉండేది. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న అమ్మ ఒడి, విద్యా దీవెన పథకాలతో ఆ భారం లేకుండా పోయింది. చిన్న కుమార్తెకు జగనన్న అమ్మఒడి వస్తుంది. పెద్ద కుమార్తె చదువుకు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన దోహదపడుతున్నాయి. అలాగే జగనన్న సొంతింటి కలను కూడా నెరవేర్చారు. ఎంతో ధైర్యంతో జీవించగలుగుతున్నాం.

– కుమార్తెలతో ఎస్.చంద్రశేఖర్ దంపతులు, 28వ వార్డు

విద్యా దీవెనతో బీఎస్సీ చదువుతున్నా..



మా నాన్న చిన్న ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. నా చదువు మా కుటుంబానికి భారం కాకూడదు అనుకున్నా. కానీ జగనన్న విద్యా దీవెన ద్వారా వచ్చిన డబ్బుతోనే నేను బీఎస్సీ చదువుతున్నాను. అలాగే జగనన్న వసతి దీవెన పథకం కింద కూడా లబ్ధి పొందుతున్నాను. పేదల చదువుకు ఊతమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– వి.గీతాప్రియ, 28వ వార్డు

అందరికీ విద్య, వైద్యం ప్రభుత్వ ధ్యేయం



మానవ వనరుల అభివృద్ధి ద్వారా రాష్ట్ర ప్రగతి సాధ్యమవుతుందని నమ్మి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అందరికీ విద్య, వైద్యం అందించాలనేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయం. 28వ వార్డులో 4294 మంది పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం రూ.14.9 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసింది.

– పల్లా అప్పలకొండ, 28వ వార్డు కార్పొరేటర్

130 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు



విద్యార్థులకు ఉపకార వేతనం అందిస్తున్న కాకతీయ కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు రాంబాబు

మద్దిలపాలెం : ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక సహాయంగా ఉపకార వేతనాలు అందించామని కాకతీయ కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు కె.రాంబాబు తెలిపారు. మద్దిలపాలెంలోని కాకతీయ కన్వెన్షన్ హాల్ సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 130 మంది విద్యార్థులకు రూ.10 వేలు చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడి చదువులో రాణిస్తున్న 9 నుంచి డిగ్రీ వరకూ చదువుతున్న విద్యార్థులను గుర్తించి ఉపకార వేతనాలకు ఎంపిక చేశామన్నారు. వారికి మూడేళ్ల పాటు ఉపకార వేతనం అందజేస్తామన్నారు. కార్యదర్శి వెంకటరావు, కోశాధికారి కృష్ణ బాలాజీ, ఉపాధ్యక్షుడు బాబూరావు, సాంబశివరావు, పూర్వ అధ్యక్షుడు ఎం.వెంకటరావు, సభ్యులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత విశాఖ లక్ష్యం



సైకిల్‌పై వస్తున్న కమిషనర్

డాబాగార్డెన్స్: వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను ఉపయోగించి విశాఖను కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు నగర ప్రజలు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు. తన బంగ్లా నుంచి సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి ఆయన సైకిల్‌పై చేరుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పెరుగుతున్న కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు వారంలో ఒక రోజు ప్రజా రవాణాను ఉపయోగిస్తున్నారన్నారు.

క్లుప్తంగా

'ఎస్సీలపై తొలి నుంచి చంద్రబాబుకు వివక్షే'



సమావేశంలో మాట్లాడుతున్న రాజబాబు

ఎంవీపీ కాలనీ: ఎస్సీలపై తొలి నుంచి టీడీపీ అధినేత చంద్రబాబు వివక్ష చూపుతున్నారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం ఉత్తరాంధ్ర రీజనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజుబాబు ఆరోపించారు. సోమవారం లాసన్స్‌బే కాలనీలోని ఎంపీ ఎంవీవీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అనేక సందర్భాల్లో ఎస్సీలను కించపరుస్తూ చంద్రబాబు తన అక్కసు వెల్లగక్కాడన్నారు. ఇటీవల అనంతపురం జిల్లా సింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులుపై బాబు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. వైఎస్సార్‌సీపీ పేదల పక్షాన నిలుస్తూ వీరాంజనేయులకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తే చంద్రబాబు అతన్ని టిప్పర్ డ్రైవర్ అంటూ అవమానించాడన్నారు. ఇది చంద్రబాబుకు ఎస్సీలపై ఉన్న చిన్నచూపునకు నిదర్శనమన్నారు. ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అంటూ గతంలో వ్యాఖ్యానించి ఎస్సీలపై తనకున్న వివక్షతను చంద్రబాబు బయట పెట్టారన్నారు. అలాంటి చంద్రబాబు పెత్తందారి తనాన్ని భూస్థాపితం చేసేందుకు ఎస్సీలంతా ఏకం కావాలని రాజబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఒడిశా ఆవిర్భావ దినోత్సవం



ఫుడ్ ఫెస్టివల్‌ను పరిశీలిస్తున్న జె.కె.నాయక్

బీచ్ రోడ్డు: ఒడిశా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఉత్కల్ సంస్కృతిక సమాజ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. 89వ ఉత్కల్ దివాస్‌ను దసపల్లాహిల్స్‌లోని ఉత్కల్ సమాజ్ కార్యాలయంలో చేపట్టారు. ఈ వేడుకలకు నగరంలో ఉన్న ఒడిశా వాసులు పెద్ద సంఖ్యలో హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా ఒడిశా సంప్రదాయ వంటకాలతో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్‌ను ఉత్కల్ సమాజ్ అధ్యక్షుడు జె.కె. నాయక్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్కల్ దివాస్‌ను ఒడిశా రాష్ట్రంలో చాలా ఘనంగా జరుపుకుంటారని, ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బిమిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి గొల్లపల్లి సుబ్బారావు



సుబ్బారావు వర్ధంతి సభలో మాట్లాడుతున్న ఆర్కే ఎస్వీ కుమార్

మద్దిలపాలెం : కార్మికుల హక్కుల పోరాట యోధుడు, కార్మిక పక్షపాతి గొల్లపల్లి సుబ్బారావు అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ అన్నారు. సుబ్బారావు వర్ధంతి సభను మద్దిలపాలెం పిఠాపురం కాలనీలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ముందుగా సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుమార్ మాట్లాడుతూ సుబ్బారావు కార్మికుల శ్రేయస్సుకు ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ యూనియన్ జిల్లా కార్యదర్శి జె.ఆర్.నాయుడు, సీఐటీయూ సీనియర్ నాయకుడు పీతల అప్పారావు, అనపర్తి అప్పారావు, ఆదినారాయణ, శ్రీను, రాజు, మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు, ఐద్వా జోన్ కార్యదర్శి కె.కుమారి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపుతోనే పేదల అభ్యున్నతి



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీ ఎంవీవీ

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఎన్నికల ప్రచారం సోమవారం 17వ వార్డులో జోరుగా సాగింది. ఇందులో భాగంగా ఎంపీ ఎంవీవీ 78వ రోజు 17వ వార్డు సెక్టార్–1లో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింట ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున తనను తూర్పు ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ విజయంతో పేదలకు మరింత ఉన్నత భవిష్యత్ లభిస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రంతో పాటు విశాఖపట్నం అభివృద్ధి వేగంగా జరుగుతుందనే విషయాన్ని ప్రతి ఓటరూ గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ ఎంవీవీ సమక్షంలో భారీగా చేరికలు



జాలరిపేట వాసులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



ఆరిలోవ, రామాటాకీస్‌కు చెందిన యువతకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎంపీ ఎంవీవీ



ఆరిలోవలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, జీవీ

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డు జాలరిపేటతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన 150 మందికి పైగా యువకులు, మత్స్యకారులు వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవారం గంపల వెంకట రామచంద్రరావు ఆధ్వర్యంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా రంజక పాలన, అభివృద్ధికి ఆకర్షితులు కావడంతో పాటు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సమర్థనాయకత్వంపై నమ్మకంతో వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వార్డులో పెద్ద ఎత్తున ప్రజలు వైఎస్సార్‌సీపీలో చేరడం అభినందనీయమన్నారు. కుల, మతాలకు అతీతంగా ముఖ్యమంత్రి జగన్ పేద ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అఖండ విజయానికి పెద్ద ఎత్తున కృషి చేయాలని వారికి సూచించారు.

➡ ఆరిలోవ, రామాటాకీస్, కేఆర్‌ఎం కాలనీ, ఇసుక తోటకు చెందిన పలువురు యువకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. 100 మంది గంపల రామచంద్రరావు ఆధ్వర్యంలో వారికి ఎంపీ ఎంవీవీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గోపాలపురం పరిశీలకుడు జి.వెంకటేశ్వరరావు, పార్టీ నాయకుడు సూరాడ దాసు పాల్గొన్నారు.

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కంచర్ల అచ్యుతరావు ఆధ్వర్యంలో సోమవారం పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారికి విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమన్నారు. అనంతరం కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. తూర్పులో వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు జీవీ, నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, ఆళ్ల శివగణేష్ పాల్గొన్నారు.

భగవద్గీతగా భావించి మేనిఫెస్టో అమలు



జైభీంనగర్‌లో సిద్ధం సభలో మాట్లాడుతున్న ఎంవీవీ సత్యనారాయణ



సిద్ధం సభలో పాల్గొన్న ప్రజలు

ఆరిలోవ: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టి నప్పటి నుంచి విశాఖ తూర్పు నియోజకవర్గం అభివృద్ధి దిశగా పయనిస్తోందని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 13వ వార్డు జైభీంనగర్‌లో సోమవారం 'మేము సిద్ధం, మా బూత్ సిద్ధం' సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గత ఎన్నికల ముందు చేపట్టిన పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలతో కూడిన మేనిఫెస్టోను భగవద్గీతగా భావించి 100 శాతం అమలు చేశారన్నారు. పేద ప్రజలు బాగుండాలనే ఆలోచనతో సంక్షేమ పథకాలు అమలు చేసి అర్హులందరికీ అందించారన్నారు. ఉత్తరాంధ్రను వెనుకబాటు నుంచి రక్షించుకోవడానికి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాల్సిన అవసరముందన్నారు. వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ ఒక సైనికుడిలా పనిచేయాలని కోరారు. సంక్షేమ పథకాలు, వలంటీర్ వ్యవస్థ, సచివాలయం వ్యవస్థ కొనసాగడానికి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కెల్ల సునీత, తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు కెల్ల సత్యనారాయణ, గూడపాటి విక్టర్, పిల్లి వీర్రాజు, శిరీషా, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త సెట్‌లో పాత పుస్తకాలు



సీబీఎస్ఈ తొమ్మిదో తరగతి సైన్స్ పాఠ్య పుస్తకంలో పెన్సిల్‌తో రాతలు(పాత పుస్తకం)



ఎంవీపీ కాలనీలో వీకేఎంఎల్ షాపులో సిబ్బందిని నిలదీస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఆరిలోవ: ప్రైవేట్ పాఠశాలల్లో చదువులు అంటేనే ఫీజులు మోత మోగుతుంది. వాటికి తోడు పాఠ్య పుస్తకాలు ధరలు ఆకాశాన్ని తాకుతాయి. ఈ ధరలు భారాన్ని భరిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరి పరిస్థితుల్లో రూ.వేలు ఖర్చు చేసి పాఠ్య పుస్తకాలు కొంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. అయితే కొత్త పాఠ్య పుస్తకాల సెట్‌లలో పాత పుస్తకాలు పెట్టి అమ్మకాలు జరుపుతున్న ఘటనలు తాజాగా వెలుగు చూస్తున్నాయి. ఆరిలోవ ప్రాంతం బాలాజీనగర్‌కు చెందిన మధుపాడ సన్యాసిరావు కుమారుడు ఎంవీపీ కాలనీలో శ్రీసత్యసాయి విద్యా విహార్‌లో ఈ ఏడాది తొమ్మిదో తరగతి(సీబీఎస్ఈ) చదువుతున్నాడు. ఆ తరగతి పాఠ్య పుస్తకాలను రూ.4,113కు గత నెల 29న ఎంవీపీ కాలనీలోని వీకేఎంఎల్ బుక్ స్టోర్‌లో కొనుగోలు చేశారు. ఆదివారం ఆ పుస్తకాలకు కవర్లు వేశారు. కవర్లు వేస్తుండగా సైన్స్ పాఠ్య పుస్తకంలో పెన్సిల్‌తో రాతలు కనిపించాయి. దీంతో పుస్తకం అంతా తెరిచి చూసేసరికి అన్ని పాఠ్యాంశాలలో పెన్సిల్‌తో రాతలు, అండర్‌లైన్ చేసి ఉన్నాయి. దీంతో సన్యాసిరావు సోమవారం పాఠశాలకు వెళ్లి ఫిర్యాదు చేశారు. కొనుగోలు చేసిన బుక్ స్టోర్ వాళ్లని అడగాలని చెప్పారు. అక్కడి నుంచి వీకేఎంఎల్ బుక్స్ స్టోర్‌కు వెళ్లి అక్కడ సిబ్బందిని నిలదీశారు. వరుపొంతనలేని సమాధానం చెప్పడంతో అక్కడ ఉన్న మరికొంత మంది విద్యార్థుల తల్లిదండ్రులు సన్యాసిరావుకు తోడై నిలదీయడంతో బుక్స్ షాపు నిర్వాహకులు అసలు విషయం ఒప్పుకొన్నారు. మా గొడౌన్ నుంచి ప్రతి సెట్‌లోనూ ఒకటి, రెండు పాత పుస్తకాలు వస్తున్నాయని అంగీకరించారు. పాత పుస్తకాలను తీసుకొస్తే వాటికి బదులు కొత్తవి ఇస్తున్నామని తెలిపారు. అప్పటికే కొనుగోలు చేసిన వారు మరికొందరు అక్కడికి చేరుకుని నిర్వాహకులను నిలదీశారు. వాళ్ల నుంచి పాత పుస్తకాలు తీసుకొని కొత్తవి ఇచ్చారు.

ఏయూ వృక్షశాస్త్ర విభాగానికి నూతన ప్రాజెక్టు



విభాగ ఆచార్యులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వృక్ష శాస్త్ర విభాగానికి బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా నూతన ప్రాజెక్టును మంజూరు చేసింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు ఏయూకు చేరాయి. వీటిని విభాగ ఆచార్యులకు ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి అందజేసి అభినందించారు. ప్రాజెక్టులో భాగంగా అంతరించిపోతున్న స్థానిక వృక్షజాతులను సేకరించి ఏయూ వృక్షశాస్త్ర విభాగంలో నర్సరీలో సంరక్షిస్తారు. భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉన్న బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా ఏయూలో వసతులు, వనరులను ప్రత్యక్షంగా పరిశీలించి ఈ ప్రాజెక్టును మంజూరు చేసింది. పర్యావరణ పరిరక్షణతో అనుసంధానమైన అంశంపై పనిచేయడం మంచి పరిణామమని వీసీ ప్రసాదరెడ్డి తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ సందర్శకులకు, విద్యార్థులకు, పరిశోధకులకు ఒక విజ్ఞాన కేంద్రంగా ఈ ప్రాజెక్టు నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్లు ఆచార్య ఎస్.బి.పడాల్, ఆచార్య బి.సుజాత, ఆచార్య పి.కె.రత్నకుమార్, విభాగాధిపతి ఆచార్య డి.సంధ్యా దీపిక, ఆచార్య బి.సంధ్య శ్రీఆచార్య పి.బలరామ్ స్వామి యాదవ్, డాక్టర్ జె.ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ముమ్మర తనిఖీలు



రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల లగేజీలను డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న సెబ్ సిబ్బంది


తాటిచెట్లపాలెం : సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నగరంలో తనిఖీలు ముమ్మరం చేశారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బి.శ్రీనివాసరావు ఆదేశాలతో సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సుబ్బారావు ఆధ్వర్యంలో సోమవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో సెబ్ సిబ్బంది రాజుల నాయుడు, ముసలనాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారానికి అనుమతులు తప్పనిసరి

మహారాణిపేట: రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి అనుమతులు తీసుకోవాలని తూర్పు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. సమావేశాలు, ఇంటింటి ప్రచారం, ర్యాలీలు, తాత్కాలిక పార్టీ ఆఫీసుల నిర్వహణకు రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి తీసుకోవాలని, లేకపోతే ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నియమ, నిబంధనల మేరకు ఎన్నికల నిర్వహణకు సహకరించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కాగా అమలు చేయడానికి వివిధ విభాగాలు పని చేస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 4, ఎంసీసీ బృందాలు 3 కేసులు నమోదు చేశాయన్నారు. పార్టీలు పెడుతున్న ఎన్నికల ఖర్చుల పరిశీలనకు ఒక అధికారి పని చేస్తున్నారన్నారు. సీ–విజిల్ యాప్ ద్వారా గానీ కంట్రోల్ రూమ్ 0891-2746314, 9154405435, 9154405462కి వచ్చిన ఫిర్యాదులను 100 నిమిషాల్లో విచారణ పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు రూ.12.20 లక్షల నగదు, 42 చీరలు, బీఎస్‌పీకి చెందిన ఒక ప్రచార రథాన్ని సీజ్ చేశామని ఆర్వో తెలిపారు.

కత్తితో దాడి చేసిన నిందితుల అరెస్ట్



పిల్లా గోవింద్ | కొత్తకోట లోకేష్ గణేష్ | వొప్పంగి అనిల్‌కుమార్

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కప్పరాడకు చెందిన ముగ్గురు యువకులను కత్తితో బెదిరించి దాడికి పాల్పడ్డ అదే ప్రాంతానికి చెందిన ముగ్గురు నిందితులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు పిల్లా గోవింద్‌పై గతంలో ఓ కేసు కూడా ఉంది. ఇతడితోపాటు కొత్తకోట లోకేష్ గణేష్, వొప్పంగి అనిల్‌కుమార్ అనే ఇద్దరు వ్యక్తులు దివ్యతేజ, మహేష్, మదన్‌తో ఆదివారం రాత్రి కంచరపాలెం కప్పరాడ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద వాగ్వాదానికి దిగి, ఘర్షణ పడ్డారు. వెంటనే గణేష్ సమీపంలోని నూడిల్స్ అమ్ముతున్న బండిలో నుంచి కత్తి తీసి బాధితులను గాయపరిచడమే కాకుండా కులం పేరుతో దూషించాడని సీఐ ఎస్ భాస్కరరావు తెలిపారు. ముగ్గురు నిందుతులని సోమవారం అదుపులోకి తీసుకుని విచారించి అరెస్ట్ చేశామని చెప్పారు. ప్రధాన నిందితుడు గణేష్‌పై రౌడీషీట్ కూడా తెరుస్తామన్నారు.బాధితుడు దివ్యతేజ ఫిర్యాదుతో ఏసీపీ స్థాయిలో విచారించి, కేసు దర్యాప్తు చేశారని పేర్కొన్నారు.